# వసంతం ఇల్లెక్కడుంది?


• నిఖిలేశ్వర్ •

వారం వారం కథాప్రభ

"వసంతం ఇల్లెక్కడ?" మా దూరపు బంధువును ఫోనులో అడిగాను.

"ఆమె ఇంటి అడ్రస్ కచ్చితంగా తెలియదు. కావాలంటే వసంతం ఫోను నంబర్ చెప్పగలను" ఆ బంధువు జవాబు.

"కావాలి-వెంటనే చెబితే సంతోషిస్తాను!" ఆదుర్దాగా చెప్పమన్నాను.



నేను వసంత ఫోనునంబర్ నోట్ చేసుకోంగానే ఆనాటి మా జీవితం తళుక్కుమంది. ఆమెతో తొలినాటి కాపురంలోని అనుభవంలో మిగిలిన ఆ మధురానుభూతులు మేల్కొన్నాయి.

వసంతం నా మొదటి భార్య!

ఇరవై ఆరు సంవత్సరాల క్రితంవిడాకులు పుచ్చుకుని మళ్లీ ఇంతవరకు నా ముఖమైనా చూడలేదు.

విడాకులు తీసుకున్నపుడు మాకు ఇద్దరు సంతానం. ఆ ఇద్దరితో వసంతం మళ్లీ తిరిగిరానని ఆనాడే వెళ్లిపోయింది.

ఇప్పుడే నా జీవితమలిసంధ్యలో ఆమెను ఒక్కసారి చూడాలనిపించింది. ఇంతవరకు నేను ఒంటరిగా ఆమెవిరహంలో గడిపిన మగాణ్ని కాను. అసలు విడాకుల కంటే ముందే మరోపెళ్లి చేసుకున్నాను! నాకంటే పదిహేను సంవత్సరాలు తక్కువ వయస్సున్న-ఒక పేదింటి అమ్మాయిని! ఆ తర్వాత ఆ రెండో ఆవిడతో జీవితం ఒక రొటీన్‌గా మారిపోయింది.

నా జీవితంలోంచి నడచి వెళ్లిపోయిన వసంతం, తన ఇద్దరు పిల్లలతో ఎన్ని అవస్థలు పడి నిలదొక్కుకున్నదో నేను పట్టించుకోలేదు. అయినా వాళ్లు వసంతం వాత్సల్యంలో ప్రయోజకులు అవుతున్నారని మామలు చెబుతూవుండేవారు.

నేను వృత్తిరీత్యా ఒక డాక్టర్‌గా స్థిరపడి, బాగా సంపాదించి సమాజంలో హోదాపొందాలనే ఆలోచనలే నన్ను వెంటాడేవి అప్పుడు! తర్వాత డబ్బుసంపాదన బాగానే పెరిగిందికానీ నా రెండో భార్యకు పిల్లలు మాత్రం పుట్టలేదు.మొదటి సంతానం దూరంగా పరాయివాళ్లుగా రక్తసంబంధాన్ని తెంచేసుకోడం నాలో మిగిలిన మూగఘోష!

ఇప్పుడు వసంతం, పిల్లలు తరచుగా జ్ఞాపకం వస్తున్నారు. నా కొడుకు, కూతురు అనే ఇద్దరు పిల్లలు ఎలావున్నారో, ఎంత ఎదిగారో చూడాలనిపిస్తున్నది. ఆమె మాత్రం తన పిల్లల భవిష్యత్తుతో ఆడుకోడమెందుకని మళ్లీ పెళ్లి చేసుకోలేదు.

ప్రస్తుతం అరవైపడిలో వున్న నేను ఎంతగా



మారిపోయానో నాకే తెలియదు. ఆకురాలుకాలంలో అడుగుపెట్టిన నా చెట్టు మళ్లీ చిగిర్చే నమ్మకంలేదు!

వసంతంకోసం ఫోను చేయగానే అటునుంచి ఆమె కంఠం! వణుకుతున్న స్వరంతో అడిగాను- "వసంతంగారేనా?నేను విశాఖనుంచి వచ్చాను. మీ ఇల్లెక్కడో చెబితే, మిమ్మల్ని కలవాలనివుంది.'

ఆమె తిరిగి-'ఎవరు మీరు? మాపెద్దబ్బాయి పెళ్లి సంబంధంకోసం చూడాలనుకుంటున్నారా?' అని తన ఇంటి అడ్రస్ ఆచూకి తెలియజేసింది.

వసంతం ఇంటి అడ్రస్ వెతుక్కుంటూ బయలుదేరాను. సులువుగానే ఆఇంటికి చేరుకున్నాను.

నేను ఆమె ఇంటితలుపు తట్టగానే లోపల గడియతీసిన చప్పుడు. నా గుండెవేగం పెరుగుతున్నది. అంత జరిగాక ఆమె ప్రవర్తన ఎలావుంటుందో? ద్వారం తెరుచుకోగానే ఎదురుగా వసంతం! కాటన్‌చీరెలో హుందాగావున్నది.

నన్ను ఎగాదిగా చూసింది. పోల్చుకోకుండానే- "ఇందాకా ఫోను చేసింది మీరేకదా! రండి, లోపలికి వచ్చి కూచోండి'' అని ఆహ్వానించింది.

మేము విడిపోయిన కాలం మా రూపాలను బాగానే మార్చివేసిందని గ్రహించాను. నేను కూడా వాళ్లు చేసి లావాటి కళ్లద్దాలతో, నూటులోవున్నానేమో, వసంతం గుర్తుపట్టలేకపోయింది వెంటనే!

నేను సోఫాలో కూచుని ఆమె వైపు పరిశీలనగా చూశాను. వసంతం కళ్లకింద నల్లచారికలు అయినా కాంతివంతంగానే వుంది. వెనకాల తీక్షణంగా మెరుస్తున్న అవేకళ్లు!

ఆమె నన్ను జాగ్రత్తగా చూసి పోల్చుకోగానే తత్తరపాటుతో లేచి నిలుచుంది.

"మీరా? డాక్టర్‌గారు, అవునా? ఇలా వచ్చారేమిటి?'' అని ఆశ్చర్యం కలగలిపి కాసింత చిరాకుతో మళ్లీ కూచుంది-సోఫాలో!

"అవును-నేనే వసంతం! మన పిల్లలెక్కడ?'-

"మన పిల్లలా? ఇంతకాలానికి గుర్తొచ్చారా? పైగా 'మన' అంటారేమిటి? మీ పిల్లలేరి? అని అడగండి'' కటువుగానే సమాధానమిచ్చింది వసంతం.

"అదేమిటి? ఎంత కాదనుకున్నా నీ పిల్లలు నా పిల్లలు కాకుండా పోతారా?''

"నన్ను 'నువ్వు' అనే ఏకవచనప్రయోగంచేసే హక్కును మీరు ఆనాడే కోల్పోయారు. ఇప్పుడు 'మీరు' అని సంబోధించడం మంచిది. నా కొడుకు కూతుళ్లకు మీరు తండ్రిననే అర్హతను ఆనాడే మట్టిలో కలిపేశారు.''

"మరీ అంత కఠినమైపోతే ఎలా వసంతగారు! మన తొలినాటి జీవనాంకురాలను నేను ఎలా మరిచిపోగలను? మీరు ఎంతో శ్రమపడి పిల్లల్ని పెంచిన సంగతి నాకు తెలుసు. బహుశా ఆనాడే నేను..."

నామాటను మధ్యలోనే కట్ చేస్తూ ఆమె మరింత కఠినంగా-"మీ బాధ్యతను గుర్తించివుంటే బాగుండేది-అంతేనంటారా? నా శ్రమదేముంది! నారక్తాన్ని పంచుకున్నవాళ్ళు-నాన్న నీడను కోల్పోయినవాళ్లు కాబట్టి నేనే సర్వస్వంగా పెంచవలసివచ్చింది. మీరు బతికున్నారని మన పిల్లలకి తెలుసు-సారీ! నాపిల్లలకు అని అనడమే సబబు.."

"అదేమిటి నా పిల్లలు కాదా?"

"మీ పిల్లలా? ఏదో కాపురం వెలగబెట్టాం కాబట్టి-దాంపత్యసుఖమనే అవసరంకోసం ఆ క్షణాల్లో మైమరిచిపోయివుంటారు. నాపిల్లలకు తండ్రి అనే బీజాలను అందజేశారు. పిల్లలను కనడానికేముంది? పశువులు కనడంలేదా! ఆ తర్వాత అవి విడిపోడం లేదా?"

"మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారు మీరు! ఆ పశువుల స్థాయికి మనలను దిగజార్చి పోల్చుకోడం సరైందికాదు."

"ఎందుకుకాదు? నా ఇద్దరు పిల్లలకు తండ్రిననిపించుకున్న మీరు, నన్ను నిర్దాక్షిణ్యంగా కొట్టి, హింసించి-మా నాన్నగారి ఆస్తినంతా మీపేరరాయించకపోతే గడప తొక్కనవసరంలేదని ఆరోజు నన్ను గెంటేయడం సరైందేనా? మీ అన్నయ్య నాపై చేయి చేసుకున్నపుడు మీరు కనీసంఅడ్డుకున్నారా?" వసంతం కళ్లలో నీళ్ల కాదు-నిప్పులు కురిసే ఆనవాళ్లు-

"ఇప్పుడు ఆచేదు అనుభవాల్ని తిరిగి తోడితే ప్రయోజనం? ఇంతకాలానికి మీతో మాట్లాడాలని, పిల్లల్ని చూడాలని ఎంతో ఆశతో ఇల్లు వెతుక్కుంటూ వచ్చాను. మీరు ఎంతో ఎదిగిపోయారని అర్థంచేసుకోగలను. నన్ను క్షమించలేకపోవచ్చు! ఆనాటి అనుబంధాన్ని తుడిచివేసి నన్ను చరిత్రహీనుడుగా చూడొద్దు!" అనునయంగా నేను అన్నాను.

"మీకు చరిత్రవుంటే కదా చరిత్రహీనుడు కావడానికి! మనుషుల మమతానురాగాలనే సంపదను-హోదాను ప్రేమించిన మీరు ఇప్పుడు అనుబంధాల గురించి ఎలా మాట్లాడగలుగుతున్నారు? కనీసం మీరెండో భార్యనైనా ప్రేమగా చూడగలుగుతున్నారా? అనుమానమే! మీ అవసరాలు తీర్చడానికి రక్తమాంసాలున్న ఒక ఆడది కావాలనికాని, మనిషిగా స్నేహాన్ని పంచిఇచ్చే వ్యక్తి అవసరం లేదని నేను ఆనాడే గ్రహించాను."

"ఒక డాక్టర్‌గా నన్ను అంతహీనంగా అంచనా వేయొద్దు వసంతా! మనం కలసివున్నరోజుల్లో పంచుకున్న సుఖానికంటే బహుశా నీకు దుఃఖమే ఎక్కువగా దక్కిందని నాకు తెలుసు. అయినా ఆ నాటి మధురస్మృతులకు సజీవంగా నిలిచిన నా పిల్లల్ని చూస్తాను. నువ్వు ఎలానూ నన్ను క్షమించలేవు. కనీసం వాళ్లనైనా క్షమించమని కోరుకుని, నావంతు ఋణాన్ని ఇప్పుడైనా తీర్చుకుంటాను." నాకు అనాయాసంగానే కన్నీళ్లు ఉబికివచ్చేశాయి.

వసంతం ఏమనుకుందో లేచి నిలుచుంది. లోపలికి వెళ్లి మంచినీళ్లు తెచ్చిఇచ్చింది. ఫ్లాస్కులో వున్న టీ కప్పులో పోసి నా ఎదుట పెట్టింది.

ఆ తర్వాత గబగబా నడుస్తూ లోపలికి మూరుమూలవున్న గదివైపు వెళ్లిపోయింది. నేను టీ తాగుతూ నలువైపులా గోడలను చూస్తున్నాను. ప్రకృతిదృశ్యాలున్న ఫోటోలు వేలాడదీసివున్నాయి. ఒకమూల కలర్ టీవీ స్టాండ్‌పై-మరోమూల టెలిఫోను-ఆపైన పెద్ద అక్షరాల్లో ఒక పోస్టర్-"స్నేహాన్ని ఇవ్వలేనపుడు దాన్ని పొందే హక్కు నీకులేదు" ఆ వాక్యం చదవగానే నావీపుపై చెర్నాకోలతో కొట్టినట్టు వొళ్లు జలదరించింది.

అప్పుడే వసంతం కొడుకుతోపాటు ప్రవేశించింది. "కరుణాకర్! వీరు డాక్టర్ నిరంజన్‌గారు. విశాఖలో బాగా ప్రాక్టీసువున్న లీడింగ్ డాక్టర్. ఒకప్పటి మీనాన్నగారు!" అని పరిచయం చేయగానే నేను నిలుచుని ఆయువకుడికి షేక్‌హాండ్ ఇచ్చి అతని ముఖంలోకి ఎగాదిగా చూశాను.

ఆ యువకుడు కరుణాకర్, నా కుమారుడు-చూడగానే అవ్యక్తమైన భావమేదో నామనోసాగరంలో కెరటంలా దూకింది. దగ్గరగా వెళ్లి మనసారా కౌగలించుకోవాలనుకున్నాను. కానీ ఆ యువకుడి కళ్లలోని నిర్లిప్తభావాన్ని పసిగట్టి వెనకడుగు వేశాను.

నాసీట్లో వచ్చి కూచున్నాను. వెంటనే ఏమీ అడగాలో తోచలేదు. నాకు ఒకకూతురు కూడా వున్నవిషయం స్ఫురణకు వచ్చింది. అప్పుడు అడిగాను-

"అమ్మాయి, అదే మీ అక్కయ్య ఎక్కడ?"

వెంటనే వసంతం అందుకుని-"అమ్మాయి ఇక్కడ లేదులెండి. డిప్యూటీ కలెక్టర్‌గా ప్రస్తుతం వరంగల్‌లో వుంటున్నది" అంది.


నేను అబ్బాయివైపు తిరిగి అడిగాను-"నువ్వు ఎక్కడ ఉద్యోగం చేస్తున్నావు బాబు?"

"కెమికల్ ఇంజనీర్‌గా సౌదీఅరేబియాలోని ఎరువులఫ్యాక్టరీలో ఉద్యోగం-సెలవుల్లో వచ్చాను మొన్ననే" చాలా యాంత్రికంగా బదులు చెప్పాడు కరుణాకర్!

"కరుణాకర్-నువ్వు నన్ను క్షమిస్తావోలేదో నాకు తెలియదు. ఆనాడు ఆస్తిపాస్తుల తగాదాలమూలం గా మీ అమ్మకు, నాకు పట్టుదల పెరిగి చివరికి విడిపోయాము. నువ్వు-అక్కయ్య ఎలా పెరిగి పెద్ద వారై ఉన్నతదశకు చేరుకోగలిగారో-అదంతా మీ అమ్మగారి ధైర్యం-మొండిగా ప్రపంచాన్ని ఎదిరిస్తూ ఒంటరిగానే జీవితాన్ని ఎదుర్కొన్న ఫలితం. మీకు ఆనాటి మీ నిస్సహాయస్థితిలో ఏరకంగాను ఆదుకోలేకపోయిన నామమాత్రపు తండ్రిని! నాకు అసలు ఇప్పుడు నా రెండో భార్య తప్ప పిల్లలు లేరు. మీకేదైనా నావంతు సహాయంచేసి నా అపరాధభావాన్ని కడిగేసుకోవాలని వచ్చాను" నేను తొట్రుపడకుండా తూచితూచి అనగలిగాను.

కరుణాకర్ స్ఫురద్రూపి. అందమైన ముఖవర్చస్సు. నన్ను కాస్సేపు అలా చూస్తూ వుండిపోయాడు.

నేను వసంతం వైపు తిరిగి అన్నాను-"మీరేమంటారు చెప్పండి. నా ఆస్తిలో సగభాగం మీ పిల్లలపేర



అతను బాక్సింగ్ ఛాంపియన్!
అతనితో
'నిన్ను ప్రేమించలేదు' అన్న ఆమే
'మేము పెళ్లి చేసుకోబోతున్నాం'
అని నలుగురిలో ఎందుకు
చెప్పింది?

'మాయా
దర్పణం'

పరుగు
పరుగుల
కథనం నడిపే
కన్నడ
రచయిత
సీరియల్

త్వరలో!


రాయాలనుకుంటున్నాను. మీరుకూడా ఆమోదించాలి!"

వసంతం వెంటనే కరుణాకర్ వైపు చూస్తూ- "నేను ఈ విషయంలో ఏమీ చెప్పను. అది కరుణాకర్ ఇష్టం. ఇక అమ్మాయి స్వతంత్రురాలు. అవసరమనుకుంటే వెళ్లి అడగండి" అంది.

కరుణాకర్ అమ్మ ముఖంచూసి భావపూరితంగా నవ్వాడు. నన్ను తదేకంగా చూస్తూ- "డాక్టర్‌గారూ! మీరు మా జన్మకు కారకులు కావచ్చు. కానీ ఒక తండ్రిగా మీ ఆప్యాయతను సంరక్షణను మేము ఎప్పుడూ పొందలేదు. మా అమ్మ తానే తల్లీతండ్రిగా, సర్వస్వంగా మమ్మల్ని తీర్చిదిద్ది వ్యక్తిత్వాన్ని ఇవ్వగలిగింది. ఈరోజు మీరు ఇలా వచ్చి, మీ ఆస్తిలో సగభాగంఇచ్చి మాకు అసలైన నాన్నగా ఒక శాశ్వతముద్ర వేయించుకోవాలని చూస్తున్నారు. మాకు ఒక నాన్న వున్నారనే సంగతి మేము ఏనాడో మరిచిపోయాము. ఈ దేశంలోని అనాథలెందరో ఆదుకోమని అర్థిస్తున్నారు. ఆ అనాథలకు సహాయం చేయండి. మా గురించి బెంగపెట్టుకోనక్కరలేదు."

కరుణాకర్ లేచినిలబడి నాముఖంవైపు చూసి చకచకా నడుస్తూ లోపలికి వెళ్లిపోయాడు.

నేను నోటిమాట రాక అలా స్థాణువులా కూచుండిపోయాను. కాస్సేపు ఆగదినిండా మౌనం పరచుకుంది. వసంతం నిశ్శబ్దంగా నన్ను పరీక్షిస్తూ కూచుంది.

నిస్పృహతో, అవమానం పొందినవాడిలా లేచి నిలుచున్నాను. నా టై సరిచేసుకుంటూ అన్నాను- "పిల్లవాడిని అంత ఆత్మాభిమానంవున్న వాడిలా పెంచినందుకు కంగ్రాట్స్!"

నేను ఆమెతో చేయికలిపి అభినందించాలని నా చేయి చాచాను. ఆమె మాత్రం చేతులు జోడించి-"మీ చేతులు తాకి అభినందనలు అందుకోలేను. మీరు నన్ను అవమానించి నన్నూ, నాపిల్లల్నీ గాలికి వదిలేశారు. ఈ మగమృగాలు ఏలుతున్న సమాజంలో నేను ఒంటరిగా నావైపు విసరిన ఆకలి చూపులను లక్ష్యపెట్టకుండా నెట్టుకొచ్చాను. ఆస్తినంతా మీపేరరాసి మావాళ్లను పరాధీనులుగా మార్చనందుకు నా అనుబంధాన్ని చేతులారా ధ్వంసం చేశారు. ఇప్పుడు కనీసం నన్ను స్పర్శించే హక్కుకూడా మీకు లేదు!"

నేను వోడిపోయినవాడుగా వసంతం గడపదాటి బయటికి నడిచాను. ఎంతో ఆశతో వసంతం ఇల్లెక్కడా? అని తిరిగి వసంతాన్ని పల్కరించి పులకరించిపోవాలనుకున్నాను. కానీ ఆనాటి నా స్వార్థానికి, అహంకారానికి వసంతం ఇప్పుడు నా జీవితంలోని ఆకురాలిన కాలాన్ని గుర్తుచేసింది. ఇక ఏమాత్రం-చిగురించలేని నా నిస్సారమైన శేషజీవితాన్ని నాకే వదిలేసింది.